క్లుప్తంగా

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని మునుగాలకు చెందిన టీచర్ కృష్ణారెడ్డి, మండల కేంద్రానికి చెందిన ఎమేలమ్మలు అనారోగ్యంతో అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అబ్రహం సోమవారం ఆయా గ్రామాలకు చేరుకొని మృతదేహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

వాయిస్ మెసేజ్‌లతో అభ్యర్థన

పాన్‌గల్: నేను ఫలానా పార్టీ నుంచి పోటీ చేస్తున్నా.. నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తా.. ఆశీర్వదించి ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. సమయా భావం వల్ల మిమ్మల్ని స్వయంగా కలవలేక పోతున్నందుకు ఏం అనుకోవద్దని.. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో ఓటు వేయాలని సెల్‌ఫోన్ వాయిస్ మెసేజ్‌ల ద్వారా కోరుతున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ.. పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులకు సంబంధించిన వాయిస్ మెస్సేజీలు తరచూ వస్తుండటంతో ఓటర్లు అసహనానికి గురవుతున్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొత్తకోట రూరల్: మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల పట్టణంలో ఈనెల 26, 27 తేదీల్లో గౌడ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన 19వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కొత్తకోటలోని గాడ్స్ ఆన్ వారియర్స్ షోటోఖాన్ కరాటే అకాడమీకి చెందిన విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి బంగారు, వెండి పతకాలు సాధించినట్లు క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన 1,200 మంది కరాటే విద్యార్థులు పాల్గొనగా తమ అకాడమీకి చెందిన 30మంది విద్యార్థులు కుమితే విభాగంలో పాల్గొని బంగారు, వెండి పథకాలు సాధించారు. పథకాలు సాధించిన విద్యార్థులకు నిర్వాహకులు అశ్వక్ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టర్లు ఎండీ జాఫర్, సాధిక్, హరీష్‌యాదవ్, ఇంతియాజ్ తదితరులు ఉన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి

నర్వ: మండల ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్‌ఐ కురుమయ్య అన్నారు. సోమవారం పాథర్చేడ్, ఉందేకోడ్, లంకాలలో కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి శాంతియుత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. ప్రజలందరికీ పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో తోడుంటారన్నారు.

జోరుగా ప్రచారం..

- కుటుంబ పాలనలో గద్వాల నియోజకర్గంలో అభివృద్ధి శూన్యమని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఎమ్మెల్యే అభ్యర్థి రంజిత్‌కుమార్ అన్నారు. సోమవారం గద్వాల మండలంలోని పరుమాల, దౌదర్‌పల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.
- ఎర్రవల్లి మండలంలోని కొండేరులో కాంగ్రెస్ నాయకులు మంద శ్రీనాథ్, ఎన్నారై పోతురాజు సోమనాద్రిలు ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి సంపత్‌కుమార్‌కు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రచారం చేశారు.

ముస్లింల అభ్యున్నతికి చేయూత



ఇంటింటి ప్రచారంలో ఓట్లు అడుగుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి కృష్ణమోహన్‌రెడ్డి

- బీఆర్ఎస్ అభ్యర్థి కృష్ణమోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: ముస్లింల అభివృద్ధికి చేయూతనిచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ అభ్యర్థి కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో 10, 11వ వార్డుల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముస్లింల జీవితాల్లో మార్పు తేవాలని కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు ఆర్థికంగా చేయూతనిచ్చారన్నారు. తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీధర్‌గౌడ్, నాయకులు హుస్మాబేగం, రిజ్వాన్, వేణుగోపాల్, మోసిన్, భీమేష్ ఉన్నారు.

బీఆర్ఎస్ చేరికలు..

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై గంజిపేట రాజు యూత్ సభ్యులతో సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలో పురవీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు.

బీఆర్ఎస్ అభివృద్ధిని చూసి ఓటేయండి..

ధరూరు: బీఆఆర్ఎస్ పార్టీ గెలిస్తేనే అభివృద్ధి సాధ్యమని, చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు పద్మావెంకటేశ్వర రెడ్డి, మండల సీనియర్ నాయకులు డీఆర్ శ్రీధర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని జాంపల్లి, నెట్టెంపాడు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



ధరూరులో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు డీఆర్



నెట్టెంపాడులో ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ పద్మా వెంకటేశ్వరరెడ్డి

దాడులు చేయించడం అమానుషం

- కర్ణాటక విద్యాశాఖ మంత్రి సుధాకరణ్



మాట్లాడుతున్న సుధాకరణ్

శాంతినగర్: కాంగ్రెస్ అభ్యర్థి సంపత్‌కుమార్ ఇంటిపై అర్ధరాత్రి ఐటీ, విజిలెన్స్ దాడులు చేయించడం అమానుషమని కర్ణాటక విద్యాశాఖ మంత్రి సుధాకరణ్ మండిపడ్డారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌లోని కాంగ్రెస్‌పార్టీ క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఉద్దేశ పూర్వకంగా అరాచకాలు జరుగుతున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని భయంతో దాడులు చేయించారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అలంపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భయపడవద్దని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి సంపత్‌కుమార్ భార్య, కోడలు నిద్రిస్తుండగా అర్ధరాత్రి దాడులు చేయించడం దారుణమన్నారు. మహిళా పోలీసులు రాకుండా మగవాళ్ల ఇంట్లోకి వెళ్లడం ఎంతవరకు సమంజసమన్నారు. బీఆర్ఎస్ కుట్రలకు ప్రజలు బుద్ధిచెప్పాలన్నారు. సంపత్‌కుమార్ భార్య ఆస్పత్రిలో ఉన్నారని ఇలా మహిళలను భయభ్రాంతులకు గురిచేయడం సరి కాదన్నారు.

శాంతినగర్‌లో అలజడి..

కాంగ్రెస్‌పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం అర్ధరాత్రి అలజడి నెలకొంది. ప్రశాంతంగా అందరు నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా అధికారులు తనిఖీ నిర్వహించడంతో ఉలిక్కిపడి అందరు నిద్రలేచారు. అధికారులు తనిఖీలు కొద్ది నిమిషాల్లోనే ముగించుకుని వెళ్లిపోయారు. క్యాంపు కార్యాలయంలో ఎలాంటి నగదు, వస్తువులు ఏవీ దొరకలేదని పార్టీ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

ధర్నా, రాస్తారోకో..

ఐటీ దాడులకు నిరసనగా కాంగ్రెస్‌పార్టీ అలంపూర్ నియోజకవర్గం ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అలంపూర్–రాయచూర్ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో కర్ణాటక చెలిగేరి ఎమ్మెల్యే రఘుమూర్తి, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం, మాజీ ఎమ్మెల్యే గడ్డం ప్రకాష్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజోళి: ప్రజల్లో కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణను చూడలేకనే కేసీఆర్, బీజేపీ ప్రభుత్వాలు కుట్రలకు దారి తీస్తున్నాయని కాంగ్రెస్ నాయకులు పెద్దింటి నాగేష్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకట్రామన్‌గౌడ్‌లు ఆరోపించారు.ఆయన ముండ్లదిన్నెలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జయరామన్‌గౌడ్, రామాంజనేయులు, మద్దిలేటి, రంగస్వామి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన..

ఎర్రవల్లిచౌరస్తా: అలంపూర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సంపత్ కుమార్ కార్యాలయంలో ఐటీ సోదాల ఘటనను ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎర్రవల్లి కూడలిలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, రాధమ్మ, శ్రీను, సోమనాద్రి, మధునాయుడు, ఆయా గ్రామాల ప్రజా



ఎర్రవల్లి కూడలిలో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బీఆర్ఎస్, బీజేపీలకు బుద్ధిచెప్పాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు

గద్వాల అర్బన్: ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్, బీజేపీలకు ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికలు అవినీతికి, అభివృద్ధికి మధ్య జరుగుతున్నాయన్నారు. ప్రజా ఉద్యమాల మాటున గద్దెనెక్కిన బీఆర్ఎస్ ప్రజల ఆకాంక్షను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ వ్యతిరేక విధానాలు, పేపర్ లీకేజీలు, లిక్కర్ మాఫియా నడుస్తోందని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబ పాలనను గద్దెదించాలన్నారు. బీఆర్ఎస్, బీజేపీలను ఓడించి, తెలంగాణ ప్రజల ఆకాంక్ష, వాగ్దానాలను అమలు చేసే కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు ఆశన్న, చెన్నయ్య, నాగర్జున, శేషన్న ఉన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు

గోపాల్‌పేట: తాడిపర్తి, గోపాల్‌పేటలో పోలీసులు సోమవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 30న జరగబోయే ఎన్నికల్లో ఓటర్లు ప్రశాంత వాతావరణంలోఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

పెబ్బేరు: ఎన్నికల నియమావళిని అనుసరించి ఈ నెల 30వ తేదీన జరగనున్న ఎన్నికల కోసం మండలంలోని ప్రజలు సహకరించాలని ఎస్‌ఐ రవిప్రకాశ్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌కు పతనం మొదలైంది



మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకుడు ఉప్పల జాన్ యాదవ్

గద్వాల అర్బన్: తెలంగాణ ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు పతనం మొదలైందని టీజేఏసీ, యూనివర్శిటీల విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పని చేసి, గద్వాలలో ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రంజిత్‌కుమార్ సీడ్‌పత్తి రైతుల సమస్యలతో పాటు అనేక సమస్యలపై, కుటుంబ పాలనకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్నారని, ఆయనకు అండగా నిలవాలని కోరారు. సమావేశంలో ఉస్మానియా, కాకతీయ, శాతవాహన, మహాత్మాగాంధీ యూనివర్శిటీల విద్యార్థి సంఘాల నాయకులు ఉప్పల జాన్ యాదవ్, మధు, శ్రీధర్, కపిల్, నాగేష్ ఉన్నారు.

తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారు



గట్టులో మాట్లాడుతున్న డీకే అరుణ

గట్టు: ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను కేసీఆర్ అప్పుల రాష్ట్రంగా మార్చారని, తెలంగాణలోని ప్రతి ఒక్కరిపై 2లక్షల అప్పు ఉన్నట్లు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం గట్టులో సకలజనుల ఆశీర్వాద సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీకే అరుణ మాట్లాడుతూ బీజేపీ గద్వాల ఎమ్మెల్యే అభ్యర్థిగా బల్గెర బోయ శివారెడ్డిని పోటీల్లో నిలబెట్టిందని, ఓటర్లు బీజేపీ కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుటుంబ పార్టీలని, పేద ప్రజలకు న్యాయం జరగాలంటే బీజేపీ నరేంద్రమోదీ నాయకత్వంలోనే జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి బల్గెర బోయ శివారెడ్డి మాట్లాడుతూ గద్వాలలో బోయ సామాజిక వర్గానికి చెందిన తనకు అవకాశం కల్పించారని, కేంద్రం, రాష్ట్రం నిధులతో నియోజక వర్గాన్ని అభివృద్ధి చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, బీజేపీకి ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాంచంద్రారెడ్డి, రామాంజనేయులు, మధుసూదన్‌రావు, వెంకటేశ్వర్‌రెడ్డి, వీరబాబు, సంధ్య, నాగప్ప, కిట్టుస్వామి, దాసు, శాలప్ప,రాజేంద్ర పాల్గొన్నారు.



రాజోళి అడివిస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



అయిజలో తులసీ మాతను పూజిస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో కార్తీకపౌర్ణమి వేడుకలు

రాజోళి: కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలో శివాలయాలు కిటకిటలాడాయి. కార్తీక పౌర్ణమి, సోమవారం కావడంతో భక్తులు ప్రత్యేకంగా పూజలు చేశారు. శివాలయాల దగ్గర భక్తి శ్రద్ధలతో ఒత్తులను వెలిగించి, స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు చేశారు.

ఉండవెల్లి: మండలంలోని శివాలయాలలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలను వెలిగించారు.

అయిజ: కార్తీక మాసం పురస్కరించుకొని మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో మహిళలు వారి నివాస గృహాల్లో సోమవారం తులసీమాతకు ప్రత్యేక పూజలు చేశారు. తులసీ మొక్కకు ప్రదక్షిణ చేస్తే భూ ప్రదక్షిణ చేసినంత పుణ్యమని భక్తుల ప్రగాఢ నమ్మకం.

అయిజ: కార్తీక మాసంలోని సోమవారం, పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని భ్రమరాంబిక గుంత రామలింగేశ్వర స్వామి ఆలయంలో వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసం సోమవారం, పౌర్ణమి శివుడికి అత్యంత ప్రీతికరమని, ప్రత్యేక పూజల్లో పాల్గొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులు కొంత మంది సత్యనారాయణ వ్రతాలు చేశారు. మరికొందరు భక్తులు గౌరిసోములు చేశారు.

కనుల పండువగా కల్యాణోత్సవం..

మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం సోమవారం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కనుల పండువగా నిర్వహించారు. అనంతరం స్వామి వారి పల్లకీ సేవ, రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సత్యహరిశ్చంద్రారెడ్డి, అరవిందరావు, మధసూదన్‌రెడ్డి, బాబురావు చంద్రోశేఖర్‌రావు, దీరేంద్రదాసు, సిబ్బంది పాల్గొన్నారు.



గుంతరామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

గంగమ్మకు ప్రత్యేక పూజలు

ధరూరు: మండలంలోని ర్యాలంపాడు రిజర్వాయర్‌లో గంగమ్మకు కోతులగిద్ద గ్రామ మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోతులగిద్ద గ్రామ శివారులోని శ్రీ అరణ్యేశ్వరస్వామి ఆలయంలో రెండు వారాలుగా కార్తీక పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం మహిళలు, చిన్నారులు కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. అనంతరం ర్యాలంపాడు రిజర్వాయర్‌లో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి నదిలో దీపాలు వదిలినట్లు ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు తెలిపారు.

కార్తీక దీపోత్సవం

గట్టు: కార్తీక పౌర్ణమి సందర్భంగా మండల కేంద్రంలో సోమవారం రాత్రి కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. సంత బజారులోని భవానీ మాత దేవాలయంలో కార్తీక దీపోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఎస్ఎస్‌కే సమాజ్ వారు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో లక్ష దీపాలను వెలిగించారు. మహిళలతో ఆలయం కిటకిటలాడింది. కార్యక్రమంలో ఎస్ఎస్‌కే సమాజ్ అధ్యక్షుడు పెద్ద అంబుసా, సభ్యులు ఈరన్న, వెంకటేష్, శ్రీనివాసులు, చంద్రమోహన్, గోవిందు, వినోద్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



ఆదిశిలా క్షేత్రంలో శ్రీనివాసుడి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

శివపార్వతుల పల్లకీ సేవ

ఉండవెల్లి: కార్తీక సోమవారం పౌర్ణమి కావడంతో మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో శివ పార్వతి విగ్రహాలను పల్లకీ సేవ నిర్వహించారు. దీపాలను శివలింగం ఆకారంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అర్చకులు ఆంజనేయ శర్మ, ధర్మకర్త దామోదర్‌రెడ్డి, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.



ర్యాలంపాడు రిజర్వాయర్‌లో దీపాలు వదులుతున్న భక్తులు, చిన్నారులు



శివుడికి అభిషేకం చేస్తున్న భక్తులు



ఉండవెల్లిలో శివాలయంలో ప్రత్యేక పూజలు

రోడ్డు మరమ్మతు పూర్తయ్యేనా?



ఎక్లాస్‌పురం శివారులో మరమ్మతు పూర్తికాని రోడ్డు

- శిథిలమైన అయిజ–ఎక్లాస్‌పురం రోడ్డు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనాలు

అయిజ: గతంలో మండల కేంద్రం నుంచి గట్టు మండల కేంద్రానికి రూ. కోట్లు ఖర్చుపెట్టి నిర్మించిన బీటీ రోడ్డు శిథిలమైంది. రోడ్డు శిథిలమై సంవత్సరాలు గడుస్తున్నా మరమ్మతుకు నోచుకోవడం లేదు. గత సంవత్సరం రూ.1.20 కోట్ల నిధులతో గట్టు మండల కేంద్రంతో పాటు మండలంలోని గొర్లకాన్‌దొడ్డిలో సీసీ రోడ్లు నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో అయిజ నుంచి ఎక్లాస్‌పురం వరకు శిథిలమైన బీటీరోడ్డుకు మరమ్మతు చేపట్టాలని కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకున్నారు. సీసీ రోడ్డు పనులు పూర్తయినా బీటీరోడ్డు ప్యాచ్ వర్క్ పనులు పూర్తిచేయలేదు. గట్టు, అయిజ మండలాల్లోని వివిధ గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

కంకర వేశారు.. నిర్మాణం మరిచారు..

గట్టు, అయిజ రెండు మండలాల మధ్య ఉన్న బీటీరోడ్డు శిథిలం కావడంతో మరమ్మతు పనులు చేపట్టారు. రోడ్డుపై ప్యాచ్‌వర్క్ చేసేందుకు రెండు నెలల క్రితం రోడ్డుపై శిథిలాలను తొలగించి కంకర పరిచారు. ఇంతవరకు పనులు పూర్తిచేయకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపై వెళ్లేందుకు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ద్విచక్ర వాహనాలు కంకరపై అదుపు తప్పి కిందపడిపోతున్నాయి. అనేక సార్లు ప్రయాణికులు గాయాలపాలయ్యారు. ప్యాచ్ వర్క్ పనులను త్వరగా పూర్తిచేయాలని రెండు మండలాల ప్రజలు కోరుతున్నా అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదని ప్రజలు మండిపడుతున్నారు.

మరమ్మతు పనులు త్వరలో పూర్తి చేస్తాం

రెండు మండలాల మధ్యనున్న అయిజ–ఎక్లాస్‌పురం రోడ్డు శిథిలం కావడంతో రోడ్డుకు మరమ్మతు చేసేందుకు ప్యాచ్ వర్క్ చేయిస్తున్నాం. శిథిలమైన రోడ్డుపై కాంట్రాక్టర్ కంకర వేయించారు. గట్టు, గొర్లకాన్‌దొడ్డిలో సీసీ రోడ్డు నిర్మాణం పనులు పూర్తయ్యాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో పనులు ఆలస్యమయ్యాయి. త్వరలో పనులు పూర్తి చేసేందుకు కృషిచేస్తాం.

– మహేష్, ఆర్‌అండ్‌బీ ఏఈ

శిథిలమై చాలా కాలమైంది..



అయిజ నుంచి గట్టు మండలానికి ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు శిథిలమై చాలా కాలమైంది. రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని రెండు మండలాల ప్రజలు అధికారులను, ప్రజలను వేడుకుంటే ప్యాచ్‌వర్క్ పనులను ప్రారంభించారు. ఇంతవరకు పనులు పూర్తి చేయలేదు. రోడ్డుపై ప్రయాణించడానికి చాలా ఇబ్బందిగా ఉంది.

– తిమ్మప్ప, ఎక్లాస్‌పురం

రోడ్డు నిర్మాణం చేయాలి..



శిథిలమైన రోడ్డుకు మరమ్మతు చేసేందుకు రెండు నెలల క్రితం రోడ్డుపై శిథిలాలను తొలగించారు. గుంతల్లో కంకర వేశారు. బీటీ రోడ్డుపై మరమ్మతులు ఇంత వరకు పూర్తి చేయలేదు. రెండు మండలాల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పనులు త్వరగా పూర్తయ్యేలా కృషి చేయాలి.

– మహబూబ్ బాషా, అయిజ

కంకర రోడ్డుపై ప్రమాదాలు..



రోడ్డుపై అనేక చోట్ల కంకర పరిచారు. ఇంతవరకు రోడ్డుపై శిథిలాలను తొలగించి వాటి స్థానంలో కంకర వేసి వదిలేశారు. కనీసం కంకరపై రోడ్డు రోలర్ కూడా తిప్పలేదు. కంకరపై ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు ప్రతికూలంగా మారింది. వాహనాలు అదుపుతప్పి అనేకసార్లు ప్రమాదాలు జరిగాయి.

– దేవేంద్ర, సింధనూరు